# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

- మంచిర్యాల ఏసీపీ తిరుపతి రెడ్డి
- లక్సెట్టిపేట మండలంలోని పోలింగ్ కేంద్రాల సందర్శన

లక్సెట్టిపేట, అక్టోబర్ 16 : అసెంబ్లీ ఎన్నికలు సమర్థవంతంగా జరిగేలా చూడాలని మంచిర్యాల ఏసీపీ తిరుపతి రెడ్డి స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఇటిక్యాలతో పాటు మండలంలోని తిమ్మాపూర్, జెండా వెంకటాపూర్, వెంకట్రావుపేటలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం స్థానిక సీఐ, ఎస్ఐలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా వివిధ పార్టీల నాయకులు ఎటువంటి విభేదాలకు తావివ్వకుండా ప్రచారాలు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందును శాంతి భద్రతలకు బంగం కల్గించకూడదని తెలిపారు. కోడ్ ఉల్లంఘిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతీ పోలింగ్ స్టేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఏసీపీ వెంట సీఐలు కృష్ణ, సంజీవ్, ఎస్ఐ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## మల్లాచారి సంతాప సభ

శ్రీరాంపూర్, అక్టోబర్ 16 : శ్రీరాంపూర్ ఓసీపీలో గుండెపోటుతో మృతి చెందిన ఆరుద్ర మల్లాచారి సంతాప సభను సోమవారం ఓసీపీపై నిర్వహించారు. ఓసీపీ మేనేజర్ సుధీర్ జక్కులవార్, ఈఈ శ్యాంసుందర్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి కందుల శంకరయ్య, కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సీనియర్ పీవో బీ శంకర్, టీబీజీకేఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి జాన్సన్, శీలం చిన్నయ్య పాల్గొన్నారు.

## ఒకరిపై కేసు

హాజీపూర్, అక్టోబర్ 16 : మండల కేంద్రంలో దాడి ఘటనకు సంబంధించి సోమవారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేశ్ కుమార్ తెలిపారు. హాజీపూర్‌కు చెందిన పూదరి రవీందర్, పార్వతి తిరుపతి మట్టి ట్రిప్పుల రవాణాలో వచ్చిన డబ్బుల పంపకంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. తిరుపతిపై రవీందర్ కుర్చీతో దాడి చేశాడు. తిరుపతి భార్య సుజాత ఫిర్యాదు మేరకు రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**మద్యం పట్టివేత..**

హాజీపూర్, అక్టోబర్ 16 : సబ్బెపల్లిలోని ఓ బెల్ట్ షాపులో అధిక ధరలకు మద్యం అమ్ముతూలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిర్వాహకురాలు లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# సంఘ విద్రోహులకు సహకరించద్దు

- ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్
- అన్నారం, పంగిడి సోమారంలో పర్యటన
- అంతర్రాష్ట్ర చెక్ పోస్టు సందర్శన..


కోటపల్లి : పంగిడిసోమారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

కోటపల్లి, అక్టోబర్ 16 : సంఘ విద్రోహశక్తులకు ఎవ్వరూ సహకరించవద్దని, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. కోటపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అన్నారం, పంగిడిసోమారంలో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకు పోలీసుల ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాలకు కొత్త వారు వచ్చినా, అనుమానాస్పదంగా సంచరించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా, ఆపద ఎదురైనా తెలుపాలని, లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

**అంతర్రాష్ట్ర చెక్ పోస్టు సందర్శన..**

రాపనపల్లి సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును డీసీపీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. చెక్ పోస్టు వద్ద 24 గంటల పాటు తనిఖీ నిర్వహించాలన్నారు. ప్రతీ వాహనాన్ని, వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, మద్యం, ఇతర వస్తువులు వచ్చే అవకాశం ఉన్నందున సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటికే తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులతో పాటు జిల్లా సరిహద్దుల్లోల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి డబ్బు, మద్యం రవాణాను అడ్డుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహారాష్ట్రతో సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

**సుంపుటం, జాజులపేట, వేమనపల్లిలో..**

వేమనపల్లి, అక్టోబర్ 16 : మండలంలోని సుంపుటం, జాజులపేట, వేమనపల్లి పోలింగ్ కేంద్రాలను డీసీపీ సందర్శించారు. గ్రామాల్లో కాలినడకన తిరిగారు. వేమనపల్లిలోని ఫెర్రీ పాయింట్లను పరిశీలించి, ప్రాణహితలో పడవలు నడిపే వారితో మాట్లాడారు. అటుగా వెళ్తున్న ప్రయాణికుల వివరాలు తెలుసుకుని, వారి వస్తువులను తనిఖీ చేశారు. ఆయన వెంట వెంట జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి, నీల్వాయి ఎస్ఐలు సురేష్, సుబ్బారావు, టీఎస్ఎస్‌పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## లక్ష్యం మేరకు చదవాలి

లక్సెట్టిపేట, అక్టోబర్ 16 : విద్యార్థులు ఒక లక్ష్యం ఎంచుకొని, సాధించేందుకు పట్టుదల, క్రమశిక్షణతో చదువాలని మంచిర్యాల ఇంటర్మీడియట్ అధికారి శైలజ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కాలేజ్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐవో ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలుగుతాన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందించేందుకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్సులు వీక్షించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజిత్‌కుమార్, అధ్యాపకులు పద్మ, అశోక్ గౌడ్, అరవింద్, శ్రీనివాస్‌రావు, హేమచందర్, మహేశ్, మహేందర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో ఆఫీస్ తరలింపు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో గల పాత డీఈవో కార్యాలయంలోకి పట్టణంలోని బైపాస్‌రోడ్ హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల ఎంఈవో కార్యాలయాన్ని సోమవారం మార్చారు. పాత డీఈవో ఆఫీస్ కలెక్టరేట్‌లోకి తరలగా, ఈ భవనంలో ఎంఈవో కార్యాలయాన్ని మార్చారు. మంచిర్యాల మండలంతోపాటు హాజీపూర్, నస్పూర్ మండలాల కార్యాలయాలు కూడా ఆ మండలాల్లో పక్కా భవనాలు నిర్మాణమయ్యే వరకు మంచిర్యాల ఎంఈవో కార్యాలయంలోనే నిర్వహించనున్నారు.

## అగ్రసేన్ జయంతి వేడుకలు

మంచిర్యాల అర్బన్/హాజీపూర్, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో మహారాజా శ్రీ అగ్రసేన్ అగర్వాల్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అగ్రసేన్‌కు ప్రత్యేక పూజలు చేసి, హారతులు ఇచ్చిన అనంతరం మహిళా మండలి సభ్యులు ఆయన జీవిత చరిత్ర ప్రతిబింబించేలా చిన్నారులు, మహిళలు నృత్యాలు, నాటికలను ప్రదర్శించారు. ఆ తర్వాత తీర్థప్రసాదాలు అందజేసి నాటిక, నృత్య ప్రదర్శన ఇచ్చిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల శాఖ అగర్వాల్ సమాజ్ చైర్మన్ సురేశ్ ప్రకాశ్ అగర్వాల్, సెక్రటరీ ప్రేమ్‌రాజ్ అగర్వాల్, కోశాధికారి విష్ణు అగర్వాల్, మహిళా మండల అధ్యక్షురాలు ప్రేమా అగర్వాల్, కార్యదర్శి పూజా అగర్వాల్, కోశాధికారి రేఖా అగర్వాల్, మార్వాడీ ప్రగతి సమాజా, మార్వాడీ యువ మంచ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న కళాకారులు

## గుండెపోటుతో నర్సు మృతి

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 16 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన నర్సు (నర్సింగ్ ఆఫీసర్) సరిత సంపూర్ణ (42) సోమవారం గుండె పోటుతో మృతి చెందినట్లు సూపరింటెండెంట్ హరీశ్ చంద్రా రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపి, ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే ప్రభుత్వ దవాఖానకు తీసుకరాగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంవో భీష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ మెర్రీ సుకన్య, దవాఖాన సిబ్బంది నివాళులర్పించారు.

## ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి, అక్టోబర్ 16 : దండేపల్లి మండల కేంద్రానికి చెందిన కల్లూరు నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, నడిపెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రూ.5వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, ఉప సర్పంచ్ గొట్ల భూమన్న, బీఆర్ఎస్ నాయకులు గోళ్ల రాజమల్లు, అల్లంల సంతోష్, లింగారెడ్డి, గరిగె మురళి, అఖిల్, గంగాధర్, లక్ష్మణ్, సత్తయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

## పారిశుధ్య కార్మికులకు బట్టలు అందజేత

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 16 : బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని మంచిర్యాల మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ తన వార్డులోని పారిశుధ్య కార్మికులకు బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాను కౌన్సిలర్‌గా గెలిచినప్పటి నుంచి బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా వార్డులోని పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని, వారు చేస్తున్న పనుల కారణంగానే వార్డులన్నీ శుభ్రంగా ఉంటున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య జవాన్ శంకర్, కార్మికులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఆయా చోట్ల నగదు సీజ్

గర్మిళ్ల, అక్టోబర్ 16 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2 లక్షల నగదును సీజ్ చేసినట్లు పట్టణ ఎస్ఐ రాజేందర్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ఓవర్ బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, స్కూటీపై వెళ్తున్న కాలేజీ రోడ్‌కు చెందిన ముత్యాల నితిన్ దగ్గర రూ.2 లక్షలు పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

**జన్నారంలో రూ1.5లక్షలు..**

జన్నారం, అక్టోబర్ 16 : మండలంలోని మందపెల్లి బస్‌స్టాండ్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా జగిత్యాలకు చెందిన అంజయ్య వద్ద రూ1.5 లక్షలు పట్టుకున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

**బెల్లంపల్లిలో రూ.55,500..**

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 16 : బెల్లంపల్లి కాల్టెక్స్ ప్లై ఓవర్‌పై వాహనాల తనిఖీ చేస్తుండగా, ముకేశ్ వద్ద రూ 55,500 లభించినట్లు టూ టౌన్ ఎస్ఐ డీ రమేశ్ తెలిపారు. ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE AT: MANTHANI**

I.A.No. 165 OF 2022
IN
O.S.No. 61 OF 2019

Between:
Surapureddy Laxminarayana ...Plaintiff
AND
Kondu Narsihama Rao ...Defendant

To,
Kondu Narsihama Rao, S/o. Venugopal Rao, age: 50 years, Occ: Business, R/o. Flot No. 101, Nehas Athmiyam, Near IB Chowrastha, Labour Colony, Mancherial, Mancherial mandal and district, T.S.

Please take notice the above named plaintiff filed the above suit against above defendant for recovery of money. The same is stands posted to on 01-11-2023 for the appearance of defendant in the matter. Therefore hereby requested to be present before above mentioned court on 01-11-2023 at 10-30 A.M. in person or through an advocate. Failing which the matter will be decided in accordance with law.

(BY ORDER OF THE COURT)

Sd/- KATUKAM SRINIVAS, Advocate, MANTHANI, COUNSEL FOR PLAINTIFF.